క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



ఆల్విన్‌కాలనీ: శ్రీమణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో పంచమి కాలనీ శ్రీమారెమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఉత్తరణక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని అయ్యప్పస్వామి మహా పడిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్‌ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌ గౌడ్‌, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, జిల్లా గణేష్‌, నర్సింగ్‌ యాదవ్‌, సతీష్‌ రావు, హరికృష్ణ, రమేష్‌రావు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

– పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకెళ్తూ సమస్యలు పరిష్కరించాలని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్‌ సర్కిల్‌ పరిధిలోని పలు డివిజన్‌లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ విభాగం అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా అవసరాల దృష్ట్యా కాలనీలో రోడ్ల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా పరిగణలోకి తీసుకొని పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. పనుల్లో వేగం పెంచాలని, అలసత్వం ప్రదర్శించకూడదని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అవసరం ఉన్న చోట కొత్త ప్రతిపాదనలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం వచ్చే లోగా అన్ని పనులు పూర్తి చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు ఎస్‌ఈ శంకర్‌ నాయక్‌, ఈఈ జీకేడీ ప్రసాద్‌, ఈఈ ఇంద్రబాయి, డీఈలు ఆనంద్‌, దుర్గ ప్రసాద్‌, విశాలాక్షి, ఏఈలు ప్రశాంత్‌, ప్రతాప్‌, సంతోష్‌ రెడ్డి పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి

జ్యోతిబాపూలే

జయంతి సందర్భంగా ఘన నివాళి



పూలమాలేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌ నర్సింహాయాదవ్‌



నివాళులర్పిస్తున్న బీసీ ఐక్య వేదిక ప్రతినిధులు మక్కాల సత్యనారాయణ, మట్టిశ్రీను, పోచయ్య, రాజుగౌడ్‌, వాసుయాదవ్‌ తదితరులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి, బడుగు బలహీనవర్గాల స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతి బాపూలే అని పలువురు అన్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే భారతదేశంలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించారని గుర్తు చేశారు. కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు.

– కూకట్‌పల్లి(జోన్‌బృందం)



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్‌ తదితరులు



జనతానగర్‌లో.. కార్పొరేటర్‌ మహేందర్‌ తదితరులు



జోనల్‌ కార్యాలయంలో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



మూసాపేట, అంబేద్కర్‌ నగర్‌లో ..



వివేకానందనగర్‌ డివిజన్‌ రిక్షాపుల్లర్స్‌ కాలనీలో నివాళులర్పించిన కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి తదితరులు

జేఎన్‌టీయూహెచ్‌ బ్రాండ్‌ను పెంపొందించడంలో అనుబంధ కళాశాలల పాత్ర కీలకం



అనుబంధ కళాశాలల ప్రతినిధులతో వీసీ టి. కిషన్‌ కుమార్‌ రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌ బ్రాండ్‌ను పెంపొందించడంలో అనుబంధ కళాశాలల పాత్ర కీలకమని వీసీ, ప్రొఫెసర్‌ కిషన్‌కుమార్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం అనుబంధ ఇంజినీరింగ్‌, ఫార్మసీ, స్టాండలోన్‌ ఎంబీఏ కళాశాలల చైర్మన్‌లు, సెక్రటరీలు, ప్రిన్సిపాళ్లతో ఇంటరాక్షన్‌ సమావేశాన్ని కళాశాలలో నిర్వహించారు. రెక్టార్‌ డా. విజయ కుమార్‌ రెడ్డి, రిజిస్ట్రార్‌ డా. కె. వెంకటేశ్వర రావు, నాన్‌ అటానమస్‌ కళాశాలల డైరెక్టర్‌ డా. ఎస్‌. తారా కల్యాణి, అటానమస్‌ కళాశాలల డైరెక్టర్‌ డా. బి. రవీందర్‌ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు జేఎన్‌టీయూహెచ్‌ను ఎంచుకున్నప్పుడే మనందిరి బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. కళాశాలల అనుబంధ ప్రక్రియను మరింత పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహించడమే ఈ సమావేశ ఉద్దేశమని పేర్కొన్నారు. అటానమస్‌ కళాశాలల్లో ఫలితాల్లో పద్ధతులు అసమగ్రంగా కనిపిస్తున్నాయని తెలిపారు. అనంతరం విద్యావిధానం (ఎన్‌ఈపీ) డీమ్డ్‌ విశ్వ విద్యాలయాలపై ప్రభుత్వ పరంగా సాగుతున్న కేసులు, ఫీజుల నియంత్రణ, విద్యార్థి, ఫ్యాకల్టీ శాతం వంటి పలు మౌలిక అంశాలు, తదితర అంశాలపై వివరంగా చర్చించారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి



ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు, నాయకులు

కూకట్‌పల్లి: బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. ఫతేనగర్‌ డివిజన్‌ బీజేపీ సీనియర్‌ నాయకుడు కంచి మహేందర్‌ ఆధ్వర్యంలో గౌతమ్‌నగర్‌లో శుక్రవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గౌతమ్‌నగర్‌ బూత్‌ అధ్యక్షుడు రాదేశ్యామ్‌ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదగిరి, బాలేష్‌, రఘు, సురేష్‌, అశోక్‌, శివ, గోపాల్‌, ఉషారాణి, బేతి రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు ఆలయాలు సిద్ధం

- నేడు హనుమాన్‌ జయంతి సందర్భంగా శోభాయాత్ర
- ఆలయాల్లో వివిధ పూజా కార్యక్రమాలు

మోతీనగర్‌: అల్లాపూర్‌, మూసాపేట డివిజన్‌లలోని పలు హనుమాన్‌ దేవాలయాల్లో శనివారం నిర్వహించే హనుమాన్‌ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అల్లాపూర్‌ డివిజన్‌లోని తులసినగర్‌, శ్రీ వివేకానందనగర్‌, పర్వత్‌నగర్‌, వి. రామారావునగర్‌, శివాజీ నగర్‌, రాణాప్రతాప్‌ నగర్‌, కొత్తూరు సీతయ్య నగర్‌లతో పాటు పలు బస్తీ, కాలనీల్లో ఉన్న హనుమాన్‌ దేవాలయాల్లో జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అదే విధంగా పాండురంగనగర్‌ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం, కబీర్‌నగర్‌ దేవాలయం, పాండురంగానగర్‌ వీకర్‌ సెక్షన్‌, బబ్బుగూడ, అవంతి నగర్‌తోటతో పాటు బస్తీ కాలనీల్లో ఉన్న హనుమాన్‌ ఆలయాలను సిద్ధం చేశారు.

పర్వత్‌నగర్‌ నుంచి హనుమాన్‌ శోభాయాత్ర

పర్వత్‌నగర్‌ చౌరస్తా నుంచి హనుమాన్‌ జయంతి సందర్భంగా శ్రీరామ యువసేన ఆధ్వర్యంలో వి. రామారావు నగర్‌ హనుమాన్‌ దేవాలయం వరకు హనుమాన్‌ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీరామ్‌ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు పులిగొల్ల శ్రీనివాస్‌ యాదవ్‌ పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటల రాజేందర్‌, బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు తదితరులు హాజరు కానున్నారు.



శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- కార్పొరేటర్‌ సబిహా బేగం

మోతీనగర్‌: డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్‌ సబిహా బేగం అధికారులకు సూచించారు. అల్లాపూర్‌ డివిజన్‌లోని రామారావునగర్‌లో శుక్రవారం నాలా అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో అదనంగా మంజూరు చేసిన రూ.1.30 కోట్ల వ్యయంతో నాలా విస్తరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. లోతట్టు ప్రాంతమైన రామారావునగర్‌లో నివసిస్తున్న ప్రజలు ఎన్నో ఏళ్ల తరబడి నాలా సమస్యను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్‌ అధ్యక్షులు నాగుల సత్యం, వెంకటయ్య యాదవ్‌, ఆవుల సంజీవ, ముక్తార్‌, సాంబ శివ, సత్యనారాయణ, కరుణాకర్‌, యోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్‌ వాహనం చోరీ

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని పర్వత్‌నగర్‌లో బుల్లెట్‌ వాహనం చోరీకి గురైన సంఘటన అల్లాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. అల్లాపూర్‌ సీఐ సామల వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన కొనడ దుర్గారావు కుటుంబ సమేతంగా అల్లాపూర్‌ డివిజన్‌ పర్వత్‌నగర్‌లో నివాసముంటూ ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల తన కుమారుడికి 8 నెలల క్రితం బుల్లెట్‌ ద్విచక్ర వాహనం(టీఎస్‌ 09 ఎఫ్‌జే 2481) కొనిచ్చాడు. రోజులాగే బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఇంటి ముందు పార్కింగ్‌ చేశారు. మరుసటి రోజు ఉదయం 5 గంటలకు లేచి చూసే సరికి బుల్లెట్‌ వాహనం లేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా సమాచారం లభించలేదు. సమీపంలోని సీసీ పుటేజీని పరిశీలించగా.. కొందరు యువకులు ఎత్తుకెళ్తున్న దృశ్యం చూసి చోరీకి గురైందని నిర్ధారించుకున్నారు. ఈ మేరకు అల్లాపూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు హనుమాన్‌ జయంతి ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: హనుమాన్‌ జయంతి సందర్భంగా శనివారం వివేకానందనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ వివేకానంద నగర్‌ అధ్యక్షుడు డా. ఎన్‌. వంశీరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 నుంచి ప్రారంభమై రాత్రి 9 గంటలకు సప్తగిరి కాలనీ రామాలయం వద్ద ముగుస్తుందని తెలిపారు.

ఇద్దరు బాలలు అదృశ్యం



గణేష్‌ నాయక్‌




రాకేష్‌ నాయక్‌

కేపీహెచ్‌బీకాలనీ: ఆడుకోవటానికి బయటకు వెళ్లిన ఇద్దరు బాలలు కనిపించకుండా పోయిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా నిలకోట తండాకు చెందిన ఆనంద్‌ నాయక్‌ తన భార్య చిట్టిబాయి, ఇద్దరు కుమారులు గణేష్‌ నాయక్‌ (13), రాకేష్‌ నాయక్‌ (10)లతో కలిసి మూడు నెలల కిందట వలస వచ్చి కూకట్‌పల్లి హౌసింగ్‌ బోర్డు కాలనీ, 4వ ఫేజ్‌లో నివసిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో తమతో పాటు తీసుకువచ్చిన ఇద్దరు కుమారులను ఇంట్లో ఉంచి తలుపు పెట్టి బయటకు పనులకు వెళ్లి వస్తున్నారు. ఇదే క్రమంలో ఈ నెల 9న ఆనంద్‌నాయక్‌ పని మీద సొంత ఊరుకు వెళ్లాడు. భార్య చిట్టి బాయి ఇద్దరినీ ఇంట్లో ఉంచి పనికి వెళ్లింది. కొద్ది సేపటికి స్థానికంగా ఉన్న కొందరు ఫోన్‌ చేసి పిల్లలు స్థానిక ఆలయంలో చోరీకి పాల్పడ్డారని చెప్పడంతో పని నుంచి వచ్చిన చిట్టి బాయి పిల్లలను వారి వద్ద నుంచి తీసుకొని ఇంటికి వచ్చింది. అనంతరం మధ్యాహ్నం సమయంలో ఆడుకునేందుకు ఇద్దరు పిల్లలు బయటకు వెళ్లారు. ఎంత సేపటికి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురై చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దొరికిన ఆచూకీ!

పోలీసుల దర్యాప్తులో తప్పిపోయిన ఇద్దరు బాలల ఆచూకీ దొరికినట్లు తెలిసింది. సీసీ పుటేజీల ఆధారంగా పిల్లలిద్దరూ నాలుగవ ఫేజ్‌ వద్ద ఉన్న ఎంఎంటీఎస్‌ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కి మలక్‌పేట, కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకోగా.. అక్కడి రైల్వే హోమ్‌ గార్డులు వారిని దారుల్‌ షిఫా చైల్డ్‌ వెల్ఫేర్‌ విభాగం అధికారులకు అప్పగించినట్లు తెలిసింది. శనివారం కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించనున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మూసాపేట: గుర్తు తెలియని ఓ వ్యక్తి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మూసాపేటలో గుర్తు తెలియని 45–50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అనారోగ్యంతో పోలీసులకు బుధవారం కనిపించాడు. వెంటనే 108 ద్వారా ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతని ఆచూకీ తెలియదని, ఎవరికైనా తెలిస్తే కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందజేయాలని కోరారు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రేరణతోనే అక్రమ కట్టడాలు

- టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే కృష్ణారావు ప్రేరణతోనే అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, వాళ్ల అనుచరులే ప్రధాన కర్తలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. హౌసింగ్‌ బోర్డులో 50కి పైగా బిల్డింగ్‌లు అక్రమ కట్టడాలు అయ్యాయని, దీని మీద డబ్బులు వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్‌ పాలనలో అక్రమ కట్టడాల వద్ద డబ్బులు వసూలు చేసి ఆస్తులు కూడ బెట్టింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి డబ్బాలు పెట్టించి, వైన్స్‌లకు సిట్టింగ్‌లు పెట్టించి నెల నెల అక్రమంగా డబ్బులు వసూలు చేయటం లేదా? అని అన్నారు. సీజ్‌ అయిన బిల్డింగ్‌లలో ఎవరైనా బిల్డర్లు, కాంట్రాక్టర్లు కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఉన్నారా? అని ఆయన ప్రశ్నించారు.



